# వసతులు ఫుల్.. చేరికలు డల్

- తిమ్మరాజుపేటలో అనువుగాని చోట బీసీ బాలికల వసతిగృహం
- సౌకర్యాలు ఉన్నా హాస్టల్‌లో చేరడానికి ఆసక్తి చూపని విద్యార్థినులు
- పట్టించుకోని సోషల్ వెల్ఫేర్ అధికారులు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



తిమ్మరాజుపేటలోని బీసీ బాలికల వసతిగృహం

కోటనందూరు: మారుమూల ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అండగా ఉండి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం. దీనిలో భాగంగా విద్యార్థులకు అనువైన ప్రాంతాల్లో వసతిగృహాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. కాగా మండలంలోని తిమ్మరాజుపేట బీసీ బాలికల వసతిగృహం ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా నడుస్తోంది. విద్యార్థినులకు ఈ హాస్టల్ అనువైన ప్రాంతంలో లేకపోవడంతో ఇక్కడ తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. విద్యార్థినులు తక్కువగా ఉండడంతో అధికారులు ఈ హాస్టల్‌ను ఇన్‌చార్జ్ వార్డెల ఆధ్వర్యంలో నడిపిస్తున్నారు. ఈ వసతిగృహం మారుమూల ప్రాంతంలో ఉండడంతో సోషల్ వెల్ఫేర్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం కొరవడింది. దశాబ్దాలుగా దయనీయ స్థితిలో కొనసాగుతున్న ఈ హాస్టల్‌పై సోషల్ వెల్ఫేర్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**అన్నిరకాల వసతులతో..**

మండలంలోని పాతకొట్టాం పంచాయతీ పరిధిలోని తిమ్మరాజుపేటలో బీసీ బాలికల వసతి గృహాన్ని 2004లో రూ.12 లక్షల మత్స్యశాఖ నిధులతో నిర్మించారు. విద్యార్థినులకు ఇక్కడ అన్ని రకాల వసతులు ఉన్నాయి. కాగా మారుమూల ప్రాంతంలో ఉండడంతో ఈ వసతి గృహంలో చేరడానికి బాలికలు ఆసక్తి కనబరచడం లేదు. 150 మందికి విద్యార్థినులకు వసతి కల్పించగల సామర్థ్యం కలిగిన ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 52 మంది మాత్రమే ఉన్నారు. ఈ దుస్థితికి కారణాలను పరిశీలిస్తే హాస్టల్ భవనం ఉన్న తిమ్మరాజుపేటలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండడంతో ఈ హాస్టల్‌లో విద్యార్థినులు ఉన్నత పాఠశాల కోసం ఇటు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతకొట్టాం గానీ, అటు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేఈ చిన్నయ్యపాలెం గాని వెళ్లవలసి వస్తుంది. అలాగే హాస్టల్ నుంచి ఉన్నత పాఠశాలలకు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉన్నప్పటికీ సమయానికి బస్సులు రాకపోవడం, నడిచి వెళ్లడం వల్ల ఆరోగ్య, ర్యాగింగ్ సమస్యలు తలెత్తుతుండడంతో ఇక్కడ హాస్టల్లో చేరేందుకు విద్యార్థినులు ఆసక్తి చూపడం లేదు.

**అంతా లోకల్ పిల్లలే..**

నిబంధనల ప్రకారం హాస్టళ్లలో దూరప్రాంత విద్యార్థులను మాత్రమే అనుమతించాలి. అయితే ఈ వసతిగృహంలో దూరప్రాంత విద్యార్థినులు చేరకపోవడంతో స్థానిక విద్యార్థినులను చేర్చుకోవాల్సి వస్తోంది. హాస్టల్ భవనం సైతం శిథిలావస్థకు చేరడంతో ఉన్న విద్యార్థినులు సైతం హాస్టల్లో భోజనం చేసి ఇళ్లకెళ్లి నిద్రపోతున్నారు.

**ఇన్‌చార్జి వార్డెన్లతోనే నిర్వహణ**

సోషల్ వెల్ఫేర్ అధికారులు ఈ హాస్టల్‌పై వివక్షత చూపుతున్నారు. ఈ హాస్టల్లో విద్యార్థినుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఏళ్ల తరబడి ఇన్‌చార్జ్ వార్డెన్లతోనే నిర్వహణ సాగిస్తున్నారు. ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తున్నా ఆ స్థాయిలో విద్యార్థినులకు సౌకర్యాలందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్‌చార్జ్ వార్డెన్ల నిర్వహణలో హాస్టల్ నిర్వహణ అంతంత మాత్రంగానే సాగుతోంది.

**హాస్టల్‌ను వేరే ప్రాంతానికి మార్చాలి**



తిమ్మరాజుపేట హాస్టల్ పిల్లలకు అనువుగాని ప్రాంతంలో ఉంది. దీంతో ఇక్కడ ఎవరూ చేరడానికి ఇష్టపడడం లేదు. హాస్టల్‌ను హైస్కూల్ ఉన్న గ్రామానికి తరలిస్తే ఎక్కువ మంది పిల్లలు చేరే అవకాశం ఉంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఈ హాస్టల్‌పై పర్యవేక్షణ కూడా కొరవడడంతో నిర్వహణతో పాటు వసతులు కూడా కొరవడ్డాయి.

– అప్పలనాయుడు, కేఈ చిన్నయ్యపాలెం

## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తుని మండలం లోవకొత్తూరు బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24 తేదీ లోగా హెచ్‌టీటీపీఎస్:// ఏపీజీపీసీఈటీ.ఏపీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వైబ్‌సైట్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీలకు 75 శాతం, కన్వర్ట్ క్రిస్టియన్ (ఎస్సీ)లకు 12 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీలకు ఐదు శాతం, ఇతరులకు రెండు శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న జరుగుతుందని వివరించారు.

### 105 మందికి గుండె వైద్య పరీక్షలు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చిన బాబు ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ప్రారంభించారు. విజయవాడకు చెందిన డాక్టర్ వైవీరావు కార్డియాలజీ ఆసుపత్రి సిబ్బంది 105 మంది రోగులకు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. 16 మందిని మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తంగా విజయవాడ ఆసుపత్రికి సూచించారు. విజయవాడ ఆసుపత్రిలో వీరికి మెరుగైన వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. ఉప సర్పంచ్ చింతకాయల చిట్టిబాబు, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, కో ఆప్షన్ మెంబర్ జిగటాల కోటసత్తిబాబు, రుత్తల జోగి రాజు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏడీవీ ప్రసాద్ శనివారం తెలిపారు. స్థానిక కోనేటిబడి సమీపంలోని స్వర్గీయ షణ్ముఖరావు ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు.

### కాజ్‌వేపై రాకపోకలు పునరుద్ధరణ



కాజ్‌వే పనులను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ఏలేరు కాలువపై ఇటీవల కూలిపోయిన కాజ్‌వే (వంతెన)పై రాకపోకలను శనివారం పునరుద్ధరించారు. పట్టణ పరిధిలోని ఏలేశ్వరం–అప్పన్నపాలెం మధ్య ఏలేరుకాలువపై నిర్మించిన కాజ్‌వే కూలిపోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కాజ్‌వే మీదుగా జగ్గంపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు పట్టణంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆధ్వర్యంలో కూలిపోయిన కాజ్‌వే వద్ద జేసీబీ సాయంతో మట్టితో పూడ్చి రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పనులకు వైఎస్సార్ సీపీ నేతలు దేగల వెంకటరమణ, సుంకర సుబ్బారావు పర్యవేక్షించారు.

### పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని రామవరం గ్రామ శివారులో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1990 స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

### పోలీసుల అదుపులో ఇద్దరు

శంఖవరం: గ్రామంలో సెల్‌ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు అనుమానితులను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అన్నవరం పోలీసులు విచారణ చేస్తున్నారు.

### తాటాకిల్లు దగ్ధం

శంఖవరం: మండలంలోని పెదమల్లాపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన బత్తిన సింహాచలం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఇంట్లోని వెండి, బంగారు ఆభరణాలతో నగదు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.1.70 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు. ఇంటిని ఆనుకొని ఉన్న జీడిమామిడి తోట సైతం కాలిపోయింది.

**ట్రాక్టర్‌పై గడ్డివామి దగ్ధం**

తొండంగి: మండలంలోని బెండపూడిలోని రైతు పొలం నుంచి ట్రాక్టర్‌పై గడ్డిని ఇంటికి తరలిస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన రైతు కె.శ్రీనివాసరావు తన రెండెకరాల పొలంలో గడ్డిని ట్రాక్టర్‌పై తరలిస్తున్నారు. కృష్ణాలయం సమీపంలోకి వచ్చేసరికి విద్యుత్‌వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. స్థానికులు తుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత రైతు తెలిపాడు.

## తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

రౌతులపూడి: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఎం.గోవింద్ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఇటీవల జరిగిన మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 26 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని 271 చేతి పంపులు ఉండగా 215 చేతిపంపులను రిపేర్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. మిగిలిన 56 చేతిపంపుల మరమ్మతులకు మండల పరిషత్ నుంచి నిధులు కేటాయిస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్, విద్యుత్ ఏఈ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, నానాజీ, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## స్టోన్ క్రషర్ తనిఖీ

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరం స్టోన్ క్రషర్‌లో శనివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి ప్రతాప్ తనిఖీలు చేశారు. స్టోన్ క్రషర్ నిర్వహణ వల్ల గ్రామంలో కాలుష్యం పెరిగిపోతోందని పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తనిఖీలు నిర్వహించినట్టు ప్రతాప్ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

## వైఎస్సార్ సీపీలో 60 కుటుంబాలు చేరిక



జె.అన్నవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో వివిధ వర్గాలకు చెందిన సుమారు 60 కుటుంబాలు టీడీపీని వీడి శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సీఎం పాలనను మెచ్చి అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## రక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ



ఇందుగపల్లిలో వాటర్ ట్యాంకు క్లీనింగ్ రికార్డును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా శివారు ప్రాంతాలకు సైతం రక్షిత మంచి నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఇండుగపల్లి, టీజే నగరం గ్రామాల్లో వాటర్ ట్యాంకుల క్లీనింగ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా? లేదా? అని పంచాయతీ కార్యదర్శులను ఆరా తీశారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఉదయం, సాయంత్రం నీటిని సరఫరా చేయాలని సూచించారు. నీటి సరఫరాలో ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు కుశిరెడ్డి అప్పలరాజు, రావాడ రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

## నూతన వేతన ఒప్పందం అమలు చేయాలి



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న క్వారీ కార్మికులు

ఏలేశ్వరం: నూతన వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని క్వారీ కార్మికులు డిమాండ్ చేశారు. ఉభయ గోదావరి జిల్లాల క్వారీ కార్మిక యూనియన్ అధ్యక్షుడు కుప్పల నాగభూషణం అధ్యక్షతన శనివారం పట్టణంలో సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ క్వారీ యాజమాన్యం వెంటనే స్పందించి నూతన వేతన ఒప్పందం అమలు చేయాలన్నారు. గతంలో చేసుకున్న అగ్రిమెంట్ గత ఫిబ్రవరి 28తో ముగిసిందన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం నూతన వేతన ఒప్పందం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై పెనుభారం మోపిందన్నారు. కేంద్రం వెంటనే గ్యాస్ ధరలను తగ్గించి పేదలను ఆదుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల రాజబాబు, ఉపాధ్యక్షుడు దేరంగుల రాజు, నీలపల్లి సుబ్బారావు, రాయుడు చిన్నా, నలమాటి సత్తిపండు, లోవరాజు, నాగరాజు, వీరబాబు పాల్గొన్నారు.

## మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదాలకు కారణమని ప్రత్తిపాడు సీఐ కె కిషోర్‌బాబు అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మినర్వా విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం సాయంత్రం ప్రత్తిపాడులో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జాతీయ రహదారిపై మినర్వా విద్యా సంస్థల వద్ద వ్యవస్థాపకుడు డీవీఎస్ రమేష్‌రాజు జెండా ఊపి ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు గుండా స్థానిక అగ్నిమాపక కేంద్రం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ కె.కిషోర్‌బాబు మాట్లాడుతూ అత్యధిక వేగంతో వాహనాలు నడపడం, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.

## అతివేగానికి ఫైన్

- పోలీసులు సీరియస్
- 72 వాహనాలపై కేసులు



జాతీయ రహదారిపై స్పీడ్ గన్‌తో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: పదహారో నంబర్ జాతీయరహదారిపై మండలంలోని రామవరం వద్ద స్పీడ్ గన్‌తో స్థానిక ఎస్సై విద్యాసాగర్ శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పరిమితికి మించి వేగంగా వెళుతున్న 72 వాహనాలపై కేసులు నమోదు చేసి, రూ.32 వేలు ఫైన్ విధించినట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. వేగం వద్దు నిదానమే ముద్దు అనే రీతిలో డ్రైవింగ్ చేయాలని వాహనదారులకు సూచించారు. అధిక వేగంతో వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. శుక్రవారం రాత్రి జగ్గంపేట శివారులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

### ముగిసిన సప్తాహం

తొండంగి: మండలంలోని బెండపూడి సాయిబాబా ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన సప్తాహం శనివారంతో ముగిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఫిబ్రవరి 23 నుంచి సాయిబాబా ఆలయంలో నిర్విరామంగా భజనలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి పంచహారతులు ఇచ్చారు. మధ్యాహ్నం ఆలయం వద్ద సుమారు 10 వేల మందికి పైగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### బీకేఎస్ ఆవిర్భావ వేడుకలు

ప్రత్తిపాడు: స్థానిక మునసబు గారి రామాలయం వద్ద శనివారం భారతీయ కిసాన్ సంఘ (బీకేఎస్) ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ బీకేఎస్ పతాకాన్ని ఆవిష్కరించి, వేడుకలను ప్రారంభించారు. రైతుల ఆరాధ్య దైవం బలరాముడు, బీకేఎస్ వ్యవస్థాపకుడు సర్ దత్తోపంత్ ఠేంగ్డేజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీకేఎస్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, నాయకులు భేరి రాము, శింగిలిదేవి అప్పారావు, మదినే బాబ్జి, దిడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### పొలంబడిపై వీఏఏలకు శిక్షణ

శంఖవరం: ప్రస్తుత వాతావరణంలో వరి పంటను ఆశించే చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీతారామశర్మ సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వీఏఏలు, వీహెచ్ఏలకు శనివారం పొలంబడిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించి తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



కిర్లంపూడిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, చిల్లంగిలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలను శనివారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, దాడి అప్పలరాజు, బుద్ద శివనారాయణ, పాముల చంటి, బిళ్లకుర్తి శివాజీ పాల్గొన్నారు.

## వైభవంగా రాజగోపాలస్వామి కల్యాణం



లింగంపర్తిలో రాజగోపాలస్వామి కల్యాణం నిర్వహించిన వేదపండితులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వార్షిక కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. తొలుత రాజగోపాలస్వామికి ఆలయ అర్చకులు వింజరపు వెంకటప్రసాద్, సత్యరామగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అవసరాల కిషోర్, దేవి దంపతులు చేతులమీదుగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. కార్యక్రమంలో అవసరాల సీతారామమూర్తి, అవసరాల వెంకటరాయుడు, ఉడతల రమణారావు, పంతం పెద కాపు, కె.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

**శనిప్రదోష వ్రత పూజలు**

ఏలేశ్వరం: పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం శనిప్రదోష వ్రత పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్ర, భగవద్గీత, లలితాసహస్ర పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరీటి, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరి, కల్యాణి, ఇందిరాప్రియదర్శిని, పాబోలు సుజాత, కొత్తరమాదేవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల నడుమ ఆలయప్రాకారంలో మూడు సార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు యనమండ్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, రమేష్ ఘనపాఠి, సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా జల్ జీవన్ మిషన్ పనులు

తొండంగి: మెట్ట గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు రిగ్ బోర్లు, పైప్‌లైన్ల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలోని ఎ.కొత్తపల్లిలో తాగునీటి బోరు రిగ్‌పనులను శనివారం సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, ఎంపీటీసీలు ఎలుగుబంటి రామకృష్ణ, నందెపు చిన్న తదితరులు ప్రారంభించారు. కాగా ఎ.కొత్తపల్లి గ్రామంలో జీఎస్ఎల్ఆర్ ట్యాంకులు శిథిలమయ్యాయి. దీంతో ఎస్సీకాలనీ, బీసీకాలనీ తదితర ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా రూ1.25 కోట్లు నిధులు మంజూరుకు కృషి చేశారు. ఆ నిధులతో ఎస్సీకాలనీ, శివాలయం సమీపంలో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కాగా తాగునీటి కోసం బోర్లు, పైప్‌లైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

### అన్నసమారాధన

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

ప్రత్తిపాడు: మహిళల అభ్యున్నతికి మహిళా పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను కోరారు. స్థానిక కోర్టు భవన ప్రాంగణంలో శనివారం మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కాటం భాను మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు పరిధిలో ఈనెల 11వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కిర్లంపూడి: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాదరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు హాలులో శనివారం సచివాలయ సిబ్బంది, సెక్రటరీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వలంటీర్లు, ఏఎన్ఎంలు సహాయం తీసుకుని యూసీడీజీ సర్వే త్వరితగతన పూర్తి చేయా లని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ బి.సతీష్‌బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### అక్రమ లేఅవుట్‌లో సరిహద్దు రాళ్లు తొలగింపు

గోకవరం: గ్రామ శివారున కోట్నీస్ ఆస్పత్రి సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్‌లో సరిహద్దు రాళ్లను శనివారం పంచాయతీ అధికారులు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి లేఅవుట్‌లో ఉన్న రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్‌ను వేయడంతో పంచాయతీ ఆధ్వర్యంలో రాళ్లను తొలగించామన్నారు. పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



తమ్మయ్యపేటలో బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలోని బెండపూడి పంచాయతీ తమ్మయ్యపేటలో అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఇటీవల తమ్మయ్యపేట గ్రామానికి చెందిన చింతల రాంబాబు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకటసత్యనారాయణ(పెద్దబ్బు), వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, పార్టీనాయకులు శనివారం బాధితులకు రూ.12 వేలు, 100 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏలేటి ధర్మరాజు, ఎంపీటీసీలు మళ్ల సురేష్, గొంతెన నాగేశ్వరరావు, బూసాల గణపతి, సోమిశెట్టి చలపతి తదితరులు ఉన్నారు.

**నిత్యావసరాల పంపిణీ**

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోటలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు శనివారం తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ నిత్యావసర వస్తువులు అందజేశారు. బురదకోటలో ముర్ల సత్యవతి, మాడెం కృష్ణకుమారిలకు చెందిన తాటాకిళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో తహసీల్దార్ గోపాలకృష్ణ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేశారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి సాయం అందజేత**

ఏలేశ్వరం: పట్టణంలోని అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి శనివారం దాత సాయం అందజేశారు. స్థానిక చైతన్యనగర్‌లో ఎస్.వెంకటలక్ష్మికి చెందిన తాటాకిల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో పారుపాక మాజీ సర్పంచ్ గాడినూకరాజు బాధితురాలికి బియ్యం, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో గాడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.